
క్లుప్తంగా

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం


గుండుగొలనులో వెంకటేశ్వర స్వామి

భీమడోలు: మండలంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుండుగొలనులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారిని శేష వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామయ్య, దుబ్బా ప్రసాద్, రాంబాబు, మద్దుల బ్రహ్మమ్ తదితరులు పాల్గొన్నారు.

థెరిస్సా విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న థెరిస్సా ప్రిన్సిపాల్ మెర్సీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రాజమహేంద్రవరంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అథ్లెటిక్ మీట్లో స్థానిక సెయింట్ థెరిస్సా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాల విద్యార్థినులు పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని ప్రిన్సిపాల్ మెర్సీ తెలిపారు. తమ విద్యార్థినులు మూడు విభాగాల్లో బంగారు, తొమ్మిది విభాగాల్లో వెండి, నాలుగు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను పతకాలు సాధించేలా తీర్చిదిద్దిన వైస్ ప్రిన్సిపాల్ మరియా క్రిష్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుశీల, వ్యాయామాధ్యాపకులు, విభాగాధిపతి పీఎం సెలియన్ రోజ్, అధ్యాపకురాలు కె.శ్యామలను, విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించామని వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్


సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న యువకులు

ఏలూరు రూరల్ : ఏసుప్రభు పుట్టుకతో ప్రపంచానికి ప్రేమ, శాంతి, సౌభ్రాతత్వంతో ప్రసరించాయని పాస్టర్ డీసీ ఏసుపాదం అన్నారు. ఆదివారం రాత్రి తంగెళ్లమూడి పెదమాలపల్లి సీఎస్ఐ చర్చి వద్ద సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రసాదు సూచనలతో సంఘ జనులు ప్రార్థనలు చేశారు. క్యాండిల్స్ వెలిగించి సెమీ క్రిస్టిమస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెదమాలపల్లి యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బండి తంబి, పి.ప్రవీణ్, కారే తరుణ్, బేతాల వరుణ్‌రాజ్, జక్కుల నవీన్, జక్కుల విజయ్, బేతాల చంటి తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో సేవలపై ఆరా


వన్‌స్టాప్ సెంటర్‌లో బూసి వినీత

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత సోమవారం సందర్శించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వన్ స్టాప్ సెంటర్‌లో ఎక్కువగా నమోదయ్యే కేసులేవి, బాధిత మహిళలకు ఏ విధమైన సేవలు అందిస్తున్నారని ఆరా తీశారు. ఈ సెంటర్లో తాత్కాలిక వసతి పొందుతున్న మహిళ వివరాలు అడిగి తెలుసుకొన్నారు. వన్ స్టాప్ సెంటర్ రిజిస్టర్లను, కేసు ఫైల్స్‌ను పరిశీలించారు. బాధిత మహిళలు, బాలికలకు మెరుగైన సేవలు అందించాలని తెలియజేశారు. ఈ సందర్శన భాగంలో వన్ స్టాప్ సెంటర్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సీహెచ్ నిర్మల, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు వినతి

గణపవరం: గణపవరం సెంటర్‌లో రెండు దశాబ్దాలుగా మూత పడి, నిరుపయోగంగా ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కిడ్నీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని అఖిలభారత హ్యాండ్‌లూమ్స్ మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో విజ్ఞప్తి చేశారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

నీటి ప్రవాహానికి అడ్డంకులు

- కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు
- ఆందోళనలో దాళ్వా రైతులు


గుండుగొలను వంతెన వద్ద గోదావరి కాల్వలో నామమాత్రంగా ప్రవహిస్తున్న నీరు


భీమడోలు వంతెన వద్ద నిలిచిన తూడు

భీమడోలు: గోదావరి కాల్వ శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. కాల్వలో పెరిగిన గుర్రపుడెక్క, తూడు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. షెట్టర్లు పాడైపోవడం, లాకులు మరమ్మతులకు గురైవడంతో నీరు వృథా అవుతుంది. నామమాత్రంగా ప్రవహిస్తున్న సాగునీరు శివారు పంట పొలాలకు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని గోదావరి కాల్వపై వంతెనల వద్ద తూడు దట్టంగా నిలిచిపోయింది. ఆయా ప్రాంతాల్లో పిల్ల కాల్వగా నీటి ప్రవాహం తగ్గింది. శివారు ప్రాంతాలైన భీమడోలు, దెందులూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ఇప్పటికే వేసిన దాళ్వా నారుమడులు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా సీజన్‌లోనే సాగునీరు అందకపోవడం, వరసగా తుఫాన్లు వల్ల వరి పంట దిగుబడులపై ప్రభావం చూపాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులంతా దాళ్వా పంటపై ఆశ పెట్టుకున్నారు.

తగ్గిన నీటి ప్రవాహం

గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని ఉంగుటూరు మండలం కైకరం, భీమడోలు, దెందులూరు మండలాల పరిధిలో 35 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఇందులో 15 వేల ఎకరాల్లో ఆక్వా చెర్వులున్నాయి. మిగిలిన 20 వేల ఎకరాల్లో పంటల సాగుకు కాల్వ నీరే ఆధారం. గోదావరి కాల్వకు 300 క్యూసెక్కుల నీరు అవసరం కాగా 200 క్యూసెక్కుల నీరే విడుదల చేస్తున్నారు. సాధారణంగా రబీలో గుండుగొలను వద్ద 5.5 అడుగుల సాగు నీరు ఉండాలి. ప్రస్తుతం 4.2 అడుగుల నీరే ప్రవహిస్తోంది. షెట్టర్లు పాడైపోవడం, లాకులు మరమ్మతులకు గురైవడంతో 50 నుంచి 60 క్యూసెక్కు నీరు వృథా అవుతుంది. దీంతో విడుదలవుతున్న 200 క్యూసెక్కు నీటిలో 150 క్యూసెక్కులే శివారు ప్రాంతాలకు నీరు చేరుతుంది.

గుర్రపు డెక్క, తూడు తొలగిస్తాం

కాల్వలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కలను తొలగించే పనులు చేపట్టామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గోదావరి కాల్వలోని శివారు ప్రాంతాల నుంచి వాటిని మెషీన్లు పెట్టి తొలగిస్తున్నామని, కొన్ని రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. నీటి ప్రవాహంపై పెంపుపైనా దృష్టి పెడతామని వివరించారు.

రైతుల గగ్గోలు

ప్రస్తుతం దాళ్వా నారుమడులను వచ్చే కొద్దిపాటి నీటితోనే రైతులు తడుపుకుంటున్నారు. ఇటీవల గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై వంతెన నిర్మించారు. కాల్వలో తూరలు వేస్తే శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరక సాగు భూములు బీడుగా మారిపోతాయని రైతులు ఉన్నతాధికారుల వద్ద తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధుల చొరవతో కాల్వలో పిల్లర్లపై గడ్డర్లను బిగింపు పనులు యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేశారు. తాత్కాలికంగా వేసిన తూరల రోడ్డును తొలగించారు. అయినప్పటికీ ఇరిగేషన్ ఉన్నతాధికారులు కాల్వకు నీటి విడుదల పెంచకపోవడం, గుర్రపు డెక్క తొలగించకపోవడంతో నీటి ప్రవాహం శివారు చేలకు చేరేట్టు లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

మొక్కలకు ట్రీ గార్డులు


పాఠశాలలో మొక్కలకు ఏర్పాటుచేసిన ట్రీగార్డులు

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేశామని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కకు ట్రీ గార్డులు ఏర్పాటు చేశామని, వీటి సంరక్షణ బాధ్యత కూడా ఆసక్తి ఉన్న విద్యార్థులకు అప్పగించామని తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

ఉంగుటూరు: ఎప్పుడు రద్దీగా ఉండే నారాయణపురం బస్టాండు సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. కొల్లేరుకు ముఖద్వారంగా ఉన్న నారాయణపురం నుంచి వందలాది మంది కొల్లేరు గ్రామాల ప్రజలు ఇక్కడకు చేరుకుని సుదూర ప్రాంతాలకు వెళ్లి, వస్తుంటారు. నారాయణపురం బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్టు గ్రామ పంచాయతీ మాజీ మెంబరు మెండ్యాల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

మూర్తిరాజు చిరస్మరణీయుడు


గణపవరం డిగ్రీ కాలేజిలో మూర్తిరాజుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గణపవరం: వందకుపైగా విద్యాసంస్థలను స్థాపించి, లక్షల మందికి విద్యాదానం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి చింతలపాటి మూర్తిరాజు చిరస్మరణీయుడని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నిర్మల కుమారి, పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మూర్తిరాజు జయంతి కార్యక్రమంలో గణపవరంలోని వివిధ విద్యాసంస్థల్లో సోమవారం నిర్వహించారు. మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మూర్తిరాజు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మూర్తిరాజు విగ్రహానికి ప్రిన్సిపాల్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, అఖిలభారత హేండ్‌లూమ్స్ మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, బీజేపీ నేత సంకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన కేంద్రంగా అభివృద్ధికి కృషి

నిడమర్రు: మాజీ మంత్రి, గాంధేయవాది చింతలపాటి మూర్తిరాజు పెదనింద్రకొలనులో నిర్మించిన మహాత్మా గాంధీ భవనాన్ని జ్ఞాన కేంద్రంగా ప్రభుత్వమే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. సోమవారం పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనంలో జరిగిన మూర్తిరాజు జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూర్తిరాజు విద్యాసంస్థల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సర్వోదయ నాయకులు సాగిరాజు జానకిరామరాజు, ఆర్‌వీఎస్ రాజు, భీమరాజు, సత్తిరాజు, సుబ్బరాజు, వంగా రఘు, బాసిరాజు తదితరులున్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం ఆదర్శనీయం

ఉంగుటూరు: పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే తెలుగువారికి గౌరవం లభించిందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరావు మాట్లాడుతూ తెలుగుజాతిని ఒకతాటిపై నిలబెట్టింది పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. డాక్టర్ కొండా రవి మాట్లాడారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజు పోటీల్లో విజేతలకు కోనా ట్రస్టు తరుపున కోనా శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అర్జీల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్

నిడమర్రు: రెవెన్యూ గ్రామ సభల్లో అందుతున్న అర్జీల త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు మండల ప్రత్యేక అధికారి ఎంవీఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం పెదనింద్రకొలను గ్రామంలో నిర్వహించిన సదస్సులో రెవెన్యూ రైతుల నుంచి భూ సమస్యలపై ఆయన దరఖాస్తులు స్వీకరించారు. 25 దరఖాస్తులు అందినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చేబ్రోలులో..

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులను నుంచి చేడు అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

భీమడోలు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మండల ప్రత్యేకాధికారి ఆర్‌పీ నాగరాణి అన్నారు. అంబర్‌పేట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 15 ఫిర్యాదులు రాగా, వాటిలో నాలుగు సమస్యలను పరిష్కారించారు. అంబర్‌పేట, కురెళ్లగూడెం సర్పంచులు ఏపూరి భానుదీపిక, గుడివాడ నాగగౌతమిలు, ఆర్ఐ కిరణకుమారి, మండల సర్వేయర్ ధర్మారావు, గ్రామకార్యదర్శి వెంకట్రావు, వీఆర్వోలు ప్రభాకర్, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ డెస్క్‌ల వితరణ


డెస్క్‌లు అందించిన సుబ్బారావు కుటుంబ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రముఖ వైద్యుడు, ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీపీడీసీ సభ్యుడు డి.సుబ్బారావు, సరస్వతి దంపతుల కుమారుడు సూర్య సాకేత్ ఫేస్‌బుక్‌లో ఉద్యోగంలో చేరిన సందర్భంగా స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం 15 కంప్యూటర్ డెస్క్‌లు అందజేశారు. కళాశాలలో ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అధ్యక్షతన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని సుబ్బారావు దంపతులు, ప్రిన్సిపాల్ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలతో నివాళుర్పించారు.

మహిళా చట్టాల అమలు తీరు దారుణం


మాట్లాడుతున్న వన్‌స్టాప్ అడ్మిన్ నిర్మల

ఏలూరు (టూటౌన్): మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఈఏ నిర్మల అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో మహిళా రక్షణ చట్టాలపై కార్యక్రమం శిక్షణ శిబిరం జిల్లా కోఆర్డినేటర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అతిథి నిర్మల్ మాట్లాడుతూ మహిళలు అన్ని చోట్లా శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. గృహ హింస చట్టం-2005లో అమలులోకి వచ్చిందని, రక్షణ చట్టాల అమలు తీరు బాగోకపోవడంతో మహిళల పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. డీబీఆర్‌సీ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం హేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం-2012లపై మాట్లాడారు. న్యాయవాది బి.కృష్ణవేణి మాట్లాడుతూ స్త్రీ సమాన హక్కుల కోసం ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిబిరంలో 40 మందికిపైగా మహిళలు, డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ రమాదేవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద పడిగాపులు కాస్తున్న ఫిర్యాదుదారులు


పోలీసుకు తన సమస్య చెప్పకుంటున్న మహిళ


తాళం వేసిన ఉన్న మీకోసం జరిగే గోదావరి మీటింగ్ హాల్

● అర్జీదారుల అసంతృప్తి

ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే సమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులకు తమ గోడు చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వ్యయ ప్రయాసల కోర్చి ప్రజలు వస్తుంటారు. తీరా వస్తే ఈ రోజు పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దైందని తెలిసి నిరాశతో తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం పోలవరంలో సీఎం చంద్రబాబు పర్యటన ఉండటంతో పీజీఆర్‌ఎస్‌ను రద్దుచేశారు. విషయం తెలియక కలక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు నిరాశతో వెనుదిరిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు


కలెక్టరేట్‌కు వస్తున్న ఫిర్యాదుదారులు


అధికారుల కోసం అర్జీదారుల ఎదురుచూపు

28న అక్కినేనికి స్వరాంజలి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ దివంగత చలన చిత్ర నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఈనెల 28న స్వరాంజలి నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆహ్వానపత్రిక విడుదల చేశారు. ఘంటసాల స్వర పీటం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం సుభాని మాట్లాడుతూ సర్ సీఆర్ రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వరాంజలి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో దేవినేని భాస్కరరావు, చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ జె.రాజేంద్ర, మేతర అజయ్ బాబు, దేవరకొండ వెంకటేశ్వర్లు, పోలవరపు దేవ రత్నాకర్, కొమ్మోజు శ్రీనివాసరావు, ఈటీ అర్జున్ రావు, కూతాడి రమేష్, సేనపతి అచ్యుత్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా సాగు పనులు


దెందులూరులో సిద్ధమైన నారుమడి


చేలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

దెందులూరు: దాళ్వా వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నారుమడులు పోయడం, దుక్కులు దున్నటం, పొలం గట్లు బాగుజేత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. దెందులూరు మండలంలో దాదాపు 15 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తున్నారు. 1123, 1153, 1156, పీఆర్ 126 రకాల వరి విత్తనాలను రైతులు అధికంగా సాగు చేస్తారు. సాధారణ వ్యవసాయంతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని ఇష్టంగా చేసే ఈ ప్రాంత రైతాంగం తరచు తుపాన్లతో బెంబేలెత్తుతున్నారు. వ్యవసాయ శాఖ సూచించిన విత్తనాలు సాగు చేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. సాగుకు సంబంధించిన అనుమానాలుంటే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

18న సెమీ క్రిస్మస్

దెందులూరు: మండలంలోని అలుగులగూడెం గ్రామంలో ది ట్రూలైట్ చర్చిలో సెమీ క్రిస్మస్ నిర్వహించనున్నట్టు పాస్టర్ ఎం ప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ దైవజనులు పల్లి విశాల్ విచ్చేస్తారని పేర్కొన్నారు.

19న గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో..

మండలం వేగవరంలోని గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో ఈ నెల 19న సెమీ క్రిస్మస్ నిర్వహిస్తామని పాస్టర్ రాజేష్ తెలిపారు. విశ్వాసులు సంఘ, సభ్యులు, సంఘ పెద్దలు, యువజనులు పాల్గొని ఆయన కోరారు.

నేడు పంచాయతీ సిబ్బందికి శిక్షణ

నిడమర్రు: సచివాలయ సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ జి.విజయకుమారి తెలిపారు. ఈ శిక్షణకు అడవికొలను, ఎనికేపల్లి, గుణపర్రు, క్రొవ్విడి, మందలపర్రు, పెదనింద్రకొలను, సిద్ధాపురం, తోకలపల్లి సచివాలయాల సిబ్బందితో పాటు గ్రామ సర్పంచ్‌లు హాజరవ్వాలని కోరారు.

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

భీమడోలు: ఎస్సీ వర్గీకరణతో క్రిమిలేయర్ విధానంగా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. ఈ మేరకు భీమడోలులో సోమవారం రాత్రి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వర్గీకరణ పేరుతో రిజర్వేషన్ల తొలగింపునకు సీఎం చంద్రబాబు, పీఎం మోదీ ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. క్రిమిలేయర్ విధానాన్ని అన్ని కులాలకు అమలు చేయకుండా ఒక్క మాల జాతికే వర్తింపు చేయడం కుట్రపూరితమేనని తెలిపారు.